# రీచార్జి చేస్తేనే.. విద్యుత్

ఎన్నికల ముందు కూటమి నాయకులు స్మార్ట్ మీటర్ల (ప్రీపెయిడ్)ను తీవ్రంగా వ్యతిరేకించారు. దీనిపై దుష్ప్రచారం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అత్యంత వేగంగా అమలు చేస్తోంది. అధికారంలో లేనప్పుడు ఒకలా, అధికారంలోకి వచ్చిన తరువాత దానికి భిన్నమైన వైఖరిని అవలంబించడం దారుణమని ప్రజా సంఘాలు ధ్వజమెత్తుతున్నాయి. ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ స్మార్ట్ మీటర్లను బిగించే ప్రక్రియ యుద్ధప్రాతిపదికన సాగుతోంది. ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థలు, పరిశ్రమలతో పాటు గృహాలకు కూడా స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయనున్నారు. పూర్తిగా వందశాతం బిగించిన తరువాత రీచార్జి చేసుకుంటేనే విద్యుత్ సరఫరా అవుతుంది. లేకుంటే విద్యుత్ సరఫరా కట్ అవుతుంది.

- ముమ్మరంగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటు
- ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు పూర్తి
- త్వరలో గృహాలకు..
- వ్యతిరేకిస్తున్న ప్రజాసంఘాలు


నూజివీడు పట్టణంలో దుకాణానికి స్మార్ట్‌మీటర్‌ను బిగిస్తున్న సిబ్బంది

నూజివీడు: నూజివీడు పట్టణంలో స్మార్ట్ మీటర్ల బిగింపు కార్యక్రమం జోరుగా సాగుతుంది. ఇప్పటికే పట్టణంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పూర్తయింది. సుమారు 300 పైగా ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లను బిగించారు. ప్రస్తుతం వ్యాపార సంస్థలకు స్మార్ట్ మీటర్లు బిగించే కార్యక్రమం కొనసాగుతోంది. ఇప్పటివరకు దాదాపు 200 పైగా దుకాణాలకు స్మార్ట్ మీటర్లు బిగించారు. రానున్న రోజుల్లో విద్యుత్ కావాలంటే ముందుగానే నగదు చెల్లించాల్సి వస్తుందని ప్రజాసంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

**నూజివీడు డివిజన్‌లో 1,96,662 సర్వీసులు**

నూజివీడు విద్యుత్ డివిజన్‌లో గృహ, వాణిజ్య, ప్రభుత్వ సర్వీసులు మొత్తం 1,96,662 సర్వీసులు ఉన్నాయి. ఇప్పటివరకు బిగించిన మీటర్లలో ఎలాంటి సిమ్ కార్డును అమర్చలేదు. దశల వారీగా వాటిని ప్రీపెయిడ్ మీటర్లుగా మార్చనున్నారు. ప్రస్తుతం విద్యుత్ బిల్లు వాడిన యూనిట్లు, శ్లాబ్‌ల ప్రకారం వస్తుందని, రేపు రీచార్జి చేసుకోవడం ద్వారా శ్లాబ్‌లు ఉంటాయా, లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విద్యుత్ యూనిట్ రేటు ఎంతుంటుందనే సందేహం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఈ నెల వినియోగించిన కరెంటు బిల్లు మరుసటి నెల చెల్లిస్తున్నాం. బిల్లు పొందిన 15 రోజుల వరకు అపరాధ రుసుం ఉండదు. అపరాధ రుసుంతో మరో 15 రోజుల వరకు కరెంటు బిల్లు చెల్లించేందుకు సమయం ఉంటుంది. ప్రీపెయిడ్ విద్యుత్ మీటర్లు అమర్చితే ఈ పరిస్థితి ఉండదు. ముందుగానే సొమ్ము చెల్లించి రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. దీంతో కొంతమేర పేదలకు ఇబ్బందిగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**రోడ్డున పడనున్న మీటర్ రీడర్లు**

ప్రీ పెయిడ్ మీటర్ రీడర్లు రోడ్డున పడే ప్రమాదం నెలకొంది. మీటరు రీడర్లు ప్రతి నెలా ఇంటింటికీ తిరిగి రీడింగ్ తీసి వినియోగదారులకు విద్యుత్ బిల్లులు అందజేస్తున్నారు. దీనికి గాను వారికి ఒక సర్వీసుకు సుమారు రూ.2.50 చెల్లిస్తున్నారు. నెలలో సగం రోజులు రీడింగ్‌లు తీసుకుంటూ, మిగిలిన సగం రోజులు ఏదో ఒక పనికి వెళ్లి జీవనాన్ని సాగిస్తున్నారు. ప్రీపెయిడ్ మీటర్ల విధానం అమల్లోకి వస్తే వారి పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారనుంది. వారు ఉపాధిని కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి నెలకొంది.

**స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు నిలిపివేయాలి**



గృహావసరాలకు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నాం. బిల్లులు ఇస్తే 15 రోజులు గడువుంటుంది కాబట్టి డబ్బులున్నప్పుడు పేదలు, మధ్య తరగతి ప్రజలు బిల్లు చెల్లిస్తారు. ఇప్పుడు ముందే రీచార్జి చేసుకోవాలంటే పేదలకు భారమే. అర్ధరాత్రి రీచార్జి అయిపోతే తెల్లవారే వరకు కరెంటు లేకుండానే ఉండాల్సి వస్తుంది.

– జి.రాజు,
సీఐటీయూ నూజివీడు పట్టణ అధ్యక్షుడు

## ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

**ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమల డిమాండ్**

తిరువూరు: దీర్ఘకాలంగా పనిచేస్తున్న ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం సత్వరం పరిష్కరించాలని ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. కమల డిమాండ్ చేశారు. తిరువూరు మండల ఆశా వర్కర్ల యూనియన్ సమావేశం శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్‌లో జరిగింది. కమల మాట్లాడుతూ గతంలో రాష్ట్ర ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీలకు వెంటనే జీఓలు జారీ చేయాలని, పదవీ విరమణ ప్రయోజనాలు రూ.60 వేలు, సహజ మరణానికి రూ.2లక్షలు, ప్రమాదవశాత్తు చనిపోతే రూ.6 లక్షలు బీమా సదుపాయం కల్పించాలని, ప్రభుత్వోద్యోగులతో సమానంగా సాధారణ సెలవులు, నాణ్యమైన సెల్‌ఫోన్లు, వైద్య సేవలు, ప్రసూతి సెలవులు కల్పించాలని, ఆశా వర్కర్ల వయో పరిమితి 62 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. తిరువూరు మండల ఆశా వర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు వజ్రమ్మ, సీఐటీయూ మండల కార్యదర్శి బి. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సారా తయారీ, విక్రయం నేరం

**ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్**

మైలవరం: సారా తయారీ, విక్రయం నేరమని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ జోశ్యుల శ్రీనివాస్ అన్నారు. సారా తాగడం వల్ల వచ్చే దుష్ఫలితాలపై గ్రామస్తులకు అవగాహనా కార్యక్రమం రెడ్డిగూడెం మండలం అన్నేరావుపేట తండాలో శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సారా తాగడం అంటే మృత్యువుకు ఆహ్వానం పలకడమేనన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**ఏడుగురి బైండోవర్**

పాత కేసులకు సంబంధించి మైలవరం తహసీల్దార్ ఎదుట ఇద్దరిని, రెడ్డిగూడెం తహసీల్దార్ ఎదుట ఐదుగురిని బైండోవర్ చేశామని సీఐ తెలిపారు.

## క్లుప్తంగా

### పుస్తక ప్రదర్శన ప్రారంభం

తిరువూరు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం స్థానిక గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు ప్రారంభించారు. గ్రంథాలయాల ప్రయోజనాలను కమిషనర్ పాఠకులకు వివరించారు. దేశభక్తి, జానపద గీతాలు, నృత్యం, కథల పోటీలలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంథాలయాధికారి పద్మావతి, తెలుగు భాషా వికాస సమితి అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలి

**ఆర్డీఓ మాధురి**

తిరువూరు: ఖరీఫ్ ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసేటప్పుడు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తిరువూరు ఆర్డీఓ కె. మాధురి అన్నారు. ధాన్యం సేకరణ విధుల్లో ఉన్న టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, హెల్పర్లు, వ్యవసాయ, సహకార సిబ్బంది శిక్షణ కార్యక్రమం ఎ.కొండూరు వెలుగు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ధాన్యం కొనుగోలు చేయాలని, రైతులకు ముందుగానే నిబంధనలు తెలియజేసి వారికి అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు.

### 44 మద్యం సీసాలు స్వాధీనం

నూజివీడు: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో 44 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. నూజివీడు మండలం తూర్పుదిగవల్లికి చెందిన పామర్తి రాంబాబు వద్ద 12 మద్యం సీసాలు, రామన్నగూడేనికి చెందిన పామర్తి చంద్రశేఖర్ వద్ద 15 మద్యం సీసాలు, చాట్రాయి మండలం చిన్నంపేటకు చెందిన షేక్ మస్తాన్‌వలి వద్ద తెలంగాణకు చెందిన 17 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశామని చెప్పారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు వై.ఈశ్వరరావు, ఎం.ప్రసాద్, హెడ్‌కానిస్టేబుళ్లు కె.వెంకటేశ్వరరావు, ఎస్.వెంకటేశ్వర్లు, పి.వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక

చాట్రాయి: మర్లపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. అండర్–17 విభాగంలో హైస్కూల్‌కు చెందిన హర్షిత, కె.పవిత్ర రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ప్రధానోపాధ్యాయులు బక్కయ్య, పీడీ సతీష్, ఉపాధ్యాయులు అభినందించారు.

### బాలల హక్కులను కాపాడాలి

నూజివీడు: ప్రతి ఒక్కరూ బాలల హక్కులను కాపాడాలని ఐసీడీఎస్ నూజివీడు సీడీపీఓ ఎస్వై నూరాని పేర్కొన్నారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం బాల్య వివాహ నిరోధంపై అధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ నూజివీడు మండలాన్ని బాల్య వివాహ రహిత మండలంగా తీర్చిదిద్దాలన్నారు. చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ జిల్లా కో–ఆర్డినేటర్ ఎస్.రవిబాబు పాల్గొన్నారు.

### బాలికా విద్యను ప్రోత్సహించాలి

మునునూరు: బాల్య వివాహాలను నిర్మూలించి, బాలికా విద్యను అందరూ ప్రోత్సహించాలని ఆంధ్రప్రదేశ్ గురుకుల బాలికల విద్యాలయ ప్రిన్సిపాల్ కొండాబత్తుల ప్రవీణ అన్నారు. మునునూరులోని బాలికల గురుకులంలో ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం బాలికలకు బాల్య వివాహాల నిరోధంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ మూఢ నమ్మకాలు, కట్టుబాట్లతో మారుమూల పల్లె ప్రజలు ఆడ పిల్లల చదువును మధ్యలోనే ఆపేసి, చిన్న వయస్సులోనే వివాహాలు చేస్తున్నారన్నారు. బాలికల ఆరోగ్య సంరక్షణ, బాలికా విద్య, బాల్య వివాహాల నిరోధం తదితర అంశాలపై అంగన్‌వాడీ కార్యకర్తలు బాలికలకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

### సంఘాల సేవలు సద్వినియోగం చేసుకోవాలి

జి.కొండూరు(మైలవరం): గ్రామాల్లోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా సహకార అధికారి శ్రీనివాసరెడ్డి అన్నారు. కవులూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సహకార వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు స్థానిక పీఏసీఎస్‌ల నుంచి రుణాలు తీసుకుని తిరిగి చెల్లించడం ద్వారా మరొకరు రుణం తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. సహకార సంఘాల ఆడిట్ అధికారి సీహెచ్ శైలజ, విజయవాడ విభాగం సహాయాధికారి కిరణ్ కుమార్, కవులూరు పీఏసీఎస్ స్పెషల్ అధికారి సీహెచ్ అంజయ్య, సీఈఓ వీరగోపీరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

### యాజమాన్య పద్ధతులతో మామిడి పూతలు

నూజివీడు: మేలైన యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా మామిడిలో సకాలంలో మామిడి పూతలు వస్తాయని నూజివీడు మామిడి పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త బొర్రా కనకమహాలక్ష్మి అన్నారు. బోర్వంచలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మామిడి తోటల్లో పాటించవలసిన మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మామిడి పూత రావటానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఉద్యాన అధికారి ఆర్.హేమ మాట్లాడుతూ మామిడి పంటకు బీమా ఉందని చెప్పారు.

## కార్తిక సందడి


బలివే రామలింగేశ్వరాలయంలో లక్ష దీపార్చన


కాచవరం రామలింగేశ్వరాలయంలో అర్ధనారీశ్వరుని అలంకరణ


మైలవరం శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు


మూలపాడు అటవీ ప్రాంతంలో పూజలందుకున్న ఆంజనేయస్వామి

కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని మైలవరం, తిరువూరు, నూజివీడు నియోజకవర్గాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుణ్యస్నానాలు ఆచరించి పూజలు చేశారు. ఇబ్రహీంపట్నంలోని పవిత్ర సంగమం వద్ద వేకువజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. మూలపాడు గ్రామానికి 18 కిలోమీటర్ల దూరంలోని అటవీప్రాంతంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో కార్తిక పౌర్ణమి పూజలు జరిగాయి. భక్తులకు అన్నదానం నిర్వహించారు. పలు శివాలయాల్లో భక్తులు కుంకుమార్చన, గోత్ర నామాలతో పూజలు చేసి దీపారాధన జరిపారు. పలుచోట్ల జ్వాలాతోరణం నిర్వహించారు. చనుబండ కోదండ రామాలయంలో అయోధ్యలో జరుగుతున్న కోటి దీపోత్సవం సందర్భంగా వచ్చిన ఒత్తులను నూనెలో తడిపి తిరిగి అయోధ్యకు పంపించనున్నారు.

–ఇబ్రహీంపట్నం/మైలవరం/విస్సన్నపేట/జి. కొండూరు/చాట్రాయి/మునునూరు


విస్సన్నపేట శివాలయంలో పూజలు


గంపలగూడెం శివాలయంలో దీపోత్సవం


ఆర్లపాడులో దీపాలతో శివలింగాకారం


వెల్లటూరు రామలింగేశ్వరస్వామి ఆలయంలో జ్వాలా తోరణం


వెల్లటూరు రామలింగేశ్వరస్వామి ఆలయంలో దీపాలను వెలిగిస్తున్న మహిళలు


చనుబండ రామాలయంలో నూనెలో ఒత్తులు కలుపుతున్న భక్తులు

## స్వాతంత్ర్యోద్యమంలో గిరిజనుల పాత్ర ప్రశంసనీయం

మైలవరం: భారత దేశ స్వాతంత్ర్యోద్యమంలో గిరిజనుల పాత్ర ప్రశంసనీయమని మైలవరం తహసీల్దార్ జి. బాలకృష్ణారెడ్డి అన్నారు. స్వాతంత్ర్య సమర యోధుడు బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని భారత గిరిజన దినోత్సవాన్ని మైలవరం శ్రీ లీలావతి గిరిజన పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు నేటి తరాలకు కూడా ఆదర్శప్రాయంగా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉదతా లక్ష్మీనారాయణ బిర్సా ముండా వేషధారణలో ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయిని షేక్ సైదాబీని తహసీల్దార్ సన్మానించారు.

**కనిమెర్ల తండాలో..**

మైలవరం మండలం కనిమెర్ల తండాలో బిర్సా ముండా జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తండాలో నిర్వహించిన గ్రామ సభలో ఎంపీడీఓ అనూరాధ మాట్లాడుతూ ఆదివాసీల్లో పోరాట భావాలను రగిలించిన తొలి వీరుడు బిర్సా ముండా అని, ఇప్పటికీ ఆయనను స్మరించుకోవడం ఆయన చేసిన సేవలకు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలను సన్మానించారు. సర్పంచ్ ఎల్. మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

**బిర్సా ముండాకు నివాళి**

తిరువూరు: స్వాతంత్ర్య సంగ్రామంలో చిన్న వయసులోనే ధీరోదాత్తంగా పోరాడిన బిర్సా ముండా చిరస్మరణీయుడని తెలుగు భాషా వికాస సమితి అధ్యక్షుడు టి. ఉమామహేశ్వరరావు అన్నారు. స్థానిక సిద్ధార్థ స్కూల్‌లో స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా జయంతి కార్యక్రమం తెలుగు భాషా వికాస సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. బిర్సా ముండా సమరయోధుడిగా పోరాడిన తీరును ఉమామహేశ్వరరావు వివరించారు. వికాస సమితి సభ్యులు రాంప్రదీప్, ఎం శేషు, సిద్ధార్థ స్కూల్ ప్రిన్సిపాల్ చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

## హోరాహోరీగా క్రీడా పోటీలు

ఎ.కొండూరు: కృష్ణారావుపాలెం గురుకుల కళాశాలలో జోన్–2 స్థాయి ఆటల పోటీలు రెండో రోజు శుక్రవారం హోరాహోరీగా జరిగాయి. సీనియర్స్ విభాగంలో 1500 మీటర్ల రన్నింగ్ పోటీల్లో ప్రథమ స్థానం కృష్ణారావుపాలెం కె. వంశీ, ద్వితీయ స్థానం తిరువూరు పి. నాగచైతన్య, తృతీయ స్థానం కొత్తూరు, కరుణాకర్ కైవసం చేసుకున్నారు. చదరంగంలో సీనియర్‌లో జి. దిలీప్‌కుమార్ ప్రథమస్థానం, బి. నాగసూర్య కొత్తూరు ద్వితీయ స్థానంలో నిలిచారు. క్యారమ్స్ సీనియర్స్ విభాగంలో కృష్ణారావుపాలెం మొదటి స్థానం, ఎల్ఎన్ పురం ద్వితీయ స్థానం సాధించారు. లాంగ్‌జంప్‌లో మొదటి స్థానం కొత్తూరు పి. హరీష్, ద్వితీయ స్థానం ఎల్ఎన్ పురం కె.అనిల్‌కుమార్, తృతీయ స్థానం టి. బాలాజీ నిలిచారు. షార్ట్‌పుట్‌లో ప్రథమ స్థానం కొత్తూరు టి. బాలాజీ సాధించారు. వివిధ అంశాల్లో క్రీడాకారులు ప్రతిభ చూపారు. పోటీలను ఎన్టీఆర్ జిల్లా సమన్వయకర్త కె. ప్రేమావతి, స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ కె. జయరాజు, ప్రిన్సిపాల్ కె సిద్ధయ్య, పీడీ, పీఈటీలు పర్యవేక్షించారు.

## వైభవంగా శోభనాచలుడి చక్రస్నానం

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలోని శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి కార్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి చక్రస్నానం, అవబృథోత్సవం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. తొలుత అవబృథోత్సవం, సప్తర్షి పూజలు జరిగాయి. అనంతరం చందనోత్సవం, చూర్ణోత్సవం, వేద పారాయణం, మహా పూర్ణాహుతి నూజివీడుకు చెందిన ఇనిగంటి వెంకటరాజు సుధాకర్‌రావు దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం శోభనగిరి మెట్లమీద కొండపై నుంచి దిగు వరకు భక్తులు దీపాలను వెలిగించి కృత్తికా దీపోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఆగిరిపల్లి చిన్న తిరునాళ్లుగా భావించే ఈ బ్రహ్మోత్సవాల్లో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు.

## పుస్తక పఠనం అలవర్చుకోవాలి

జి.కొండూరు(మైలవరం): ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జైలర్ పరిటాల రామ్మోహనరావు అన్నారు. జి.కొండూరు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రెండో రోజు పుస్తక పఠనం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని, విజ్ఞాన భాండాగారాలన్నారు. ఉద్యోగ అన్వేషణలో ఉన్న యువతకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. గ్రంథాలయాధికారి వి. విజయకృష్ణ, పాఠకులు పాల్గొన్నారు.

- పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలను శాఖ గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. స్థానిక సప్తగిరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ మహ్మద్ గాలి షాహిద్ పుస్తక ప్రదర్శనను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు దేశభక్తి గేయాలు, పద్యాల పోటీ నిర్వహించారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ ఆదూరి అంజనేయులు, గ్రంథాలయ నిర్వాహకురాలు జే. శ్రీలత, విద్యార్థులు పాఠకులు పాల్గొన్నారు.
- విస్సన్నపేట: స్థానిక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. వివిధ రకాల పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు వాటిని వినియోగించుకుని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని లైబ్రేరియన్ భాను అన్నారు.
- గోపవరం(మునునూరు): గ్రంథాలయాలతోనే విద్యార్థులకు, పాఠకులకు పుస్తక పఠనం అలవడుతుందని వైస్ ఎంపీపీ పాముల గంగాధర్ అన్నారు. గోపవరం బ్రాంచి గ్రంథాలయంలో శాఖాధికారి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన నష్టాలు అంశంపై సీహెచ్‌ఓ సౌమ్య బాలలకు అవగాహన కల్పించారు. విద్యార్థి జీవితంలో గ్రంథాలయాలు–మాతృ భాష తెలుగు ప్రాధాన్యాన్ని, పుస్తక పఠనం వలన ప్రయోజనాలను వైస్ ఎంపీపీ పాఠకులకు వివరించారు.

## ప్రణాళికలు సిద్ధం చేయాలి

చాట్రాయి: గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో గ్రామాల అభివృద్ధి ప్రణాళికల తయారీపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తక్షణ అభివృద్ధి అవసరాలను గుర్తించి ప్రణాళికలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని చెప్పారు. ఎంఈఓ బ్రహ్మచారి, వ్యవసాయాధికారి బి.శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## గురుస్వామికి సన్మానం

విస్సన్నపేట: స్థానిక అయ్యప్పస్వామి మండల పీఠం గురుస్వామి ఓలేటి దుర్గారావు స్వామిని శుక్రవారం సన్మానించారు. అయ్యప్పస్వామి దీక్ష 36వ సారి ఆయన స్వీకరించడంతో పీఠంలోని అయ్యప్ప దీక్షాపరులు కార్తిక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం స్థానిక శివాలయం వద్ద సన్మానించారు. అనంతరం ట్రాక్టర్‌పై పీఠం వరకు ప్రదర్శన నిర్వహించారు.

## అధికారులకు శిక్షణ

విస్సన్నపేట: గ్రామ పంచాయతీల నిర్వహణకు సంబంధించి మండలంలోని అధికారులకు గ్రేడ్ 1 నుంచి గ్రేడ్ 6 వారికి, వీఓ ప్రెసిడెంట్‌లకు శిక్షణ కార్యక్రమం స్థానిక వెలుగు కార్యాలయం మీటింగ్‌హాల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈఓపీఆర్డీ హరికృష్ణకుమార్ పలు అంశాలపై అవగాహన కల్పించారు.

## సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

ఊటుకూరు(గంపలగూడెం): ఊటుకూరు కోదండ రామస్వామి దేవాలయంలో కార్తిక పౌర్ణమి సందర్భంగా శ్రీ రమా సహిత వీర వెంకట సత్యనారాయణ స్వామి వ్రతం శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 17 మంది దంపతులు పీటలపై కూర్చుని వ్రతాన్ని ఆచరించారు. లక్కీడిప్ ద్వారా ఎంపికైన ఐదుగురు మహిళలకు కమిటీ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు.



## వెయిట్ లిఫ్టింగ్‌లో విద్యార్థుల ప్రతిభ

మైలవరం: జేఎన్‌టీయూకే వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి పతకాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు శుక్రవారం తెలిపారు. ఈ నెల 13న చీరాల సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన జేఎన్‌టీయూకే వెయిట్ లిఫ్టింగ్ (మెన్, ఉమన్) పోటీల్లో 55 కిలోల కేటగిరి విభాగాల్లో మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఏరోస్పేస్ ఫైనల్ ఇయర్ విద్యార్థి యు. సాయి సంజయ్ వర్ధన్ 86 కిలోలు బరువు ఎత్తి బంగారు పతకం, 86 కిలోలు కేటగిరిలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం ద్వితీయ సంవత్సరం విద్యార్థి పీ.వీ. సాయిరామ్ 77 కిలోలు బరువు ఎత్తి సిల్వర్ పతకం, 61 కిలోలు కేటగిరిలో సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఫైనల్ ఇయర్ విద్యార్థి పి. విక్టర్ 116 కిలోలు బరువు ఎత్తి బంగారు పతకం, 67 కిలోలు కేటగిరిలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థి కే.కే.సిద్ధార్థ 127 కిలోలు బరువు ఎత్తి బంగారు పతకం సాధించారని వివరించారు. బాలుర విభాగంలో ఓవరాల్ చాంపియన్‌షిప్ రన్నర్స్ సాధించిన విద్యార్థులను పలువురు అభినందించారు.


వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు

## జనవరి 5న హైందవ శంఖారావం సభ

నూజివీడు: ప్రభుత్వ పెత్తనం నుంచి హిందూ దేవాలయాలకు విముక్తి చేసి హిందూ ధార్మిక సంఘాలకు అప్పగించాలనే డిమాండ్‌తో జనవరి 5న విజయవాడలో హైందవ శంఖారావం భారీ బహిరంగ సభ నిర్వహించనున్నామని హైందవ శంఖారావం జిల్లా ప్రముఖ్ వంశీజీ అన్నారు. నూజివీడులోని మాటూరి హోటల్‌లో శుక్రవారం హైందవ శంఖారావం నూజివీడు ఖండ సన్నాహక సమావేశం నిర్వహించారు. వంశీజీ మాట్లాడుతూ హైందవ శంఖారావ సభ ద్వారా దేశ వ్యాప్తంగా హిందూ దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తి చేసి స్వయం ప్రతిపత్తి కలిగిన ధార్మిక వ్యవస్థకు అప్పగిస్తూ చట్టం చేయాలని విశ్వ హిందూ పరిషత్ ఒక జాతీయ ఉద్యమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ సందర్భంగా హైందవ శంఖారావం కరపత్రాన్ని ఆవిష్కరించారు.

## ఘనంగా వేణుగోపాలుని కల్యాణం

నెమలి(గంపలగూడెం): మండలంలోని నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం స్వామి వారి మాస కల్యాణం ఘనంగా నిర్వహించారు. సత్యభామ, రుక్మిణీదేవి సమేత వేణుగోపాలస్వామి కల్యాణాన్ని ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలాచార్యులు, అర్చక బృందం సంప్రదాయ బద్ధంగా జరిపారు. ఎనిమిది మంది దంపతులు పీటలపై కూర్చుని కన్యాదానం చేశారు. కల్యాణం విశిష్టతను అర్చకులు వివరించారు.